నమస్తే తెలంగాణ

నల్లగొండ

5 | నల్లగొండ, సోమవారం 26 ఆగస్టు 2024 | NALGONDA




సూర్యాపేట ఇంద్రవెల్లి ముత్యాలమ్మ ఆలయం వద్ద బోనాల వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

## మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బోనాలు

- ఇంద్రవెల్లి ముత్యాలమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, ఆగస్టు 25 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక బోనాల పండుగ అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తాళ్లగడ్డలో కొలువైన ఇంద్రవెల్లి ముత్యాలమ్మకు ఆదివారం భక్తులు బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ దేవతలను తమ ఇంటి ఆడబిడ్డగా భావించి పూజించే విశిష్టమైన సంప్రదాయం కేవలం తెలంగాణకే సొంతమన్నారు. ఇంద్రవెల్లి ముత్యాలమ్మ అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై కలుగాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం భక్తులు పెద్ద ఎత్తున వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఇంద్రవెల్లి ముత్యాలమ్మ బోనాల సందర్భంగా అమ్మవారి వద్ద మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బైరు వెంకన్నగౌడ్, బీఆర్ఎస్ పట్టణ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు సవరాల సత్యనారాయణ, బూర బాలసైదులు, మున్సిపల్ కౌన్సిలర్లు, ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల వేణారెడ్డి, పోతు భాస్కర్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



బోనాల ఊరేగింపులో శివసత్తులు

## ఉత్సాహంగా అంతర్జాతీయ టెన్నిస్ పోటీలు



యాదాద్రి భువనగిరి, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ) : అంతర్జాతీయ టెన్నిస్ పోటీలకు భువనగిరి వేదికైంది. జిల్లా కేంద్రంలోని న్యూ డైమెన్షన్ టెన్నిస్ అకాడమీలో ఆదివారం అంతర్జాతీయ టెన్నిస్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. రాజనర్సింహారావు మెమోరియల్ ఐటీఎఫ్ వరల్డ్ జూనియర్స్ టూర్ అండర్ -18 టోర్నమెంట్‌కు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆస్ట్రేలియా, కెనడా, యూఎస్, ఇండియాలోని వివిధ రాష్ట్రాల చెందిన 170 మంది టెన్నిస్ క్రీడాకారులు టోర్నమెంట్లో పాల్గొనడానికి వచ్చారు. సోమవారం నుంచి మెయిన్ డ్రా మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. బాలికలు, బాలుర విభాగాల్లో వారంపాటు పోటీలు జరుగనున్నాయి. ఈ నెల 30న ఫైనల్స్ నిర్వహించనున్నారు.

# 50 కిలోలకు 47 కిలోలే?

## రేషన్ బియ్యం తూకాల్లో తేడాలు

### ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద డీలర్లకు వచ్చే బియ్యం చోరీ

### ప్రతినెలా రూ.55లక్షలకు పైనే అక్రమార్జన..?

### కనిపించని దోపిడీ.. అధికారులు, కాంట్రాక్టర్లకు పంపకాలు



ఓ డీలర్ వద్ద 50 కిలోల బస్తా 47 కిలోలుగా చూపిస్తున్న దృశ్యం

**రేషన్ బియ్యం అక్రమాల పాలవుతున్నది. ఇప్పటివరకు రేషన్ డీలర్ల నుంచి వినియోగదారులకు అందించే బియ్యం పక్కదారి పడుతున్నట్లు ఆరోపణలు రాగా ఇప్పుడు ఎఫ్‌సీఐ, ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచే అవకతవకలు జరుగున్నట్లు తెలుస్తున్నది. ఇందుకు డీలర్లకు వచ్చే బియ్యం బస్తాలే నిదర్శనం. ఒక్కో బస్తా 50 కిలోలు ఉండాల్సి ఉండగా రెండు నాలుగు కిలోల వరకు తక్కువగా ఉంటున్నాయి. డీలర్లకు వచ్చే బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద దోపిడీ చేస్తున్నట్లు సమాచారం. సూర్యాపేట జిల్లాలో ప్రతి నెలా దాదాపు 59,463 క్వింటాళ్ల బియ్యం 1,18,926 డీలర్లకు చేరుతుండగా బస్తాకు 2 కిలోల చొప్పున తక్కువ వేసుకున్నా 2,378 క్వింటాళ్ల బియ్యం పక్కదారి పట్టినట్లే. అంటే సుమారు రూ.55 లక్షలు దోచేస్తున్నారు. ఇలా వచ్చిన సొమ్మును కాంట్రాక్టర్లు, అధికారులు పంచుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.**

– సూర్యాపేట, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ)



మరో డీలర్ వద్ద 44 కిలోలే

### స్టేజ్-2లోనే దోపిడీ..

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేద, మధ్య తరగతి ప్రజలకు పంపిణీ చేసే రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయనగానే దానికి కారకులు డీలర్లే అనడం పరిపాటిగా మారింది. కానీ అసలు దోపిడీ ఎక్కడ జరుగుతున్నది? లక్షలాది రూపాయల పాపపు సొమ్మును పంచేసుకునే వారు ఎవరు? అనే విషయాలు తెలిస్తే అవాక్కవడమే. సూర్యాపేట జిల్లాలో 3,04,353 ఫుడ్ సెక్యూరిటీ కార్డులతోపాటు 19,799 అంత్యోదయ, 36 అన్నపూర్ణ కార్డులు కలిపి మొత్తం 3,24,188 కార్డులు ఉన్నాయి. వీటన్నింటికీ ప్రతినెలా సుమారు 59,463 క్వింటాళ్ల బియ్యాన్ని అధికారులు అలాట్ చేస్తుంటారు. స్టేజ్-1 అంటే ఎఫ్‌సీఐ, స్టేజ్-2 అంటే జిల్లాలోని నాలుగు ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా డీలర్లకు 50 కిలోల బస్తాలు చేరుతాయి. ఇక్కడ డీలర్లకు చేరే బియ్యంలో దోపిడీ జరుగుతున్నది. స్టేజ్-1 నుంచి స్టేజ్-2కు వే బ్రిడ్జి ద్వారా కాంటాలు వేస్తారు. కానీ స్టేజ్-2 నుంచి డీలర్లకు వచ్చే బియ్యాన్ని మాత్రం బస్తాలుగా పంపిస్తున్నారు.

### బస్తాకు రెండు కిలోలు తక్కువ

డీలర్లకు వచ్చే 50కిలోల బస్తాలో 2 నుంచి రెండున్నర కిలోల వరకు బియ్యం తక్కువ వస్తున్నట్లు డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డీలర్లకు రావాల్సినవి నికరంగా బస్తాతో కలిపి 50.50 కిలోలు ఉండాల్సి ఉండగా 48 కిలోలు మాత్రమే ఉంటున్నాయి. కొన్ని బస్తాలు 45 నుంచి 47 కిలోలే ఉంటున్నాయి. ఇదేమని ప్రశ్నించే డీలర్లపై దాడులు చేసి కిలో నుంచి పది కిలోలు తక్కువ ఉన్నా, ఎక్కువ ఉన్నా 6ఏ కేసులు నమోదు చేస్తున్నందున కిమ్మనకుండా ఉంటున్నారు. అదే ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి వచ్చే బియ్యాన్ని మాత్రం ఎవరూ తనిఖీ చేయడం లేదని, దానికి లోలోపల అమ్యామ్యాలు అందిపుచ్చుకోవడమేనని కారణమని పలువురు ఆరోపిస్తున్నారు.

### ప్రతి నెలా రూ.55లక్షల దోపిడీ..

జిల్లాలోని 3,24,188 కార్డులకు సుమారు 59,463 క్వింటాళ్ల బియ్యాన్ని పంపిస్తున్నారు. ఒక్కో బియ్యం బస్తాలో రెండు కిలోలు తక్కువ ఉంటుండగా జిల్లాలోని నాలుగు ఎంఎల్ఎస్ పాయింట్లలో దాదాపు 2,378 క్వింటాళ్ల బియ్యం పక్కదారి పడుతున్నాయి. ప్రభుత్వ ధర ప్రకారం క్వింటాకు రూ.2,300ల చొప్పున వాటి విలువ సుమారు రూ.54.60 లక్షలు. ఈ డబ్బులను అంతా కలిసి పంచుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరి కిలో నుంచి 10 కిలోల బియ్యం ఎక్కువ లేదా తక్కువ ఉన్నా డీలర్లపై 6ఏ కేసులు నమోదు చేసే అధికారులు ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి డీలర్లకు వచ్చే బియ్యాన్ని ఎందుకు చెక్ చేయడం లేదని పలువురు డీలర్లు ధ్వజమెత్తుతున్నారు.

# కాన్పుకొస్తే కష్టాలే!

## నల్లగొండ జిల్లా కేంద్ర దవాఖానలో మరో ఘటన.. ప్రసవంలోనే శిశువు మృతి

- కుర్చీలో గర్భిణి ప్రసవం జరిగిన సంఘటన మరువక ముందే ఇంకో దారుణం
- అందుబాటులో లేని వైద్యులు.. నర్సులతో నామమాత్రంగా చికిత్స
- డాక్టర్లు, నర్సుల నిర్లక్ష్యంతోనే శిశువు మృతి చెందిందని బాధితుల ఆందోళన



నల్లగొండ జిల్లా కేంద్ర దవాఖానలో శిశువు మృతిపై పోలీసుల విచారణ

రామగిరి, ఆగస్టు 25 : నల్లగొండ జిల్లా కేంద్ర దవాఖానలో వైద్యుల నిర్లక్ష్యంతో ప్రసవానికి వచ్చిన మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రెండ్రోజులుగా చోటు చేసుకుంటున్న సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. గురువారం దేవరకొండ ప్రాంతం నుంచి ప్రసవానికి వచ్చిన మహిళకు సకాలంలో చికిత్స చేయకపోవడంతో కుర్చీలోనే ప్రసవం జరిగిన విషయం విదితమే. ఈ విషయంలో జిల్లా అదనపు కలెక్టర్ పూర్ణచందర్ సంబంధిత డాక్టర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దాంతో శనివారం డాక్టర్లు మూకుమ్మడిగా సామూహిక సెలవులు పెట్టడంతో వైద్య సేవలు కొనసాగలేదు. ఈ క్రమంలోనే నల్లగొండ జిల్లా కేంద్ర దవాఖానకు మాడ్గులపల్లి మండలం గారకుంటపాలెం గ్రామానికి చెందిన చెరుకుపల్లి శ్రీలతను మూడో కాన్పు కోసం జిల్లా కేంద్ర దవాఖానలోని మాతాశిశు సంరక్షణ కేంద్రానికి శుక్రవారం సాయంత్రం ఆమె కుటుంబ సభ్యులు తీసుకొచ్చారు. అయితే.. వైద్యులు వచ్చి పరిశీలించలేదు. నర్సులు మాత్రమే వచ్చి డాక్టర్లు రేపు ఉదయం 10గంటలకు వస్తారని నిర్లక్ష్యంగా వ్యవహరించారు. శనివారం వైద్యులు, సిబ్బందిలో చాలా మంది మూకుమ్మడిగా సెలవులు పెట్టారు. డాక్టర్లు వైద్య పరీక్షలు చేయకపోవడంతో శనివారం సాయంత్రం 6గంటల సమయంలో ప్రైవేట్ ఆసుపత్రికి ఆటోలో తీసుకెళ్లేందుకు బాధితురాలి బంధువులు ప్రయత్నిస్తుండగా.. సిబ్బంది, డ్యూటీ డాక్టర్ స్వరూపారాణి అడ్డం తిరిగి ఆపరేషన్ చేస్తామని లోపలికి తీసుకెళ్లారు. ఆమెకు స్కాన్ చేసి తల్లీ బిడ్డ బాగానే ఉన్నారు.. ఆందోళన అవసరం లేదని చెప్పారు. ఆ వెంటనే మరో డాక్టర్‌కు ఫోన్ చేయగా వచ్చారు. ఆయనతో కలిసి హడావుడిగా రాత్రి 8గంటల సమయంలో ఆపరేషన్ చేయించారు. కానీ.. గర్భంలోనే మగ శిశువు మృతిచెందింది. డాక్టర్లు ఫోన్ మాట్లాడుతూ నిర్లక్ష్యంగా ఆపరేషన్ చేయడంతోనే శిశువు మృతిచెందిందని బాధితులు ఆరోపిస్తున్నారు. శిశువు ఒంటిపై అక్కడక్కడ గాయాలు ఉండడంతో వైద్యురాలితో గొడవకు దిగారు. రాత్రి నల్లగొండ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆసుపత్రి ఎదుట ధర్నాకు దిగారు.

### కలెక్టర్ ఆదేశాలు అమలు చేయని వైద్యులు

నల్లగొండ జిల్లా కేంద్ర ఆసుపత్రిలో సంఘటనలపై స్పందించిన కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆసుపత్రికి వచ్చే రోగులకు సత్వర వైద్యం అందించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలుంటాయని చాలా పర్యాయాలు హెచ్చరించారు. అయినప్పటికీ సిబ్బంది, డాక్టర్లు నిర్లక్ష్యం వహిస్తుండటంతో కలెక్టర్ ఒక జీఓ తీశారు. రోజూ జిల్లా స్థాయి అధికారి ఒకరు ఆసుపత్రిని తనిఖీ చేస్తారు. ఎవరైనా పనితనం సక్రమంగా లేకుంటే చర్యలుంటాయని ఆ జీఓలో పేర్కొన్నారు. అయినప్పటికీ బేఖాతరు చేస్తూ వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే మరో ఘటన జరిగింది.

### ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది స్పందించలేదు

నా భార్య శ్రీలతను ప్రసవం కోసం శుక్రవారం సాయంత్రం 4:30 గంటలకు ప్రభుత్వ దవాఖానకు తీసుకొచ్చాం. డాక్టర్లు లేరు.. రేపు ఉదయం 10గంటలకు వస్తారని అక్కడున్న నర్సులు చెప్పారు. ఎలాంటి వైద్యం చేయలేదు. శ్రీలత ఇబ్బంది పడుతుండటంతో గ్లూకోజు మాత్రం పెట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎవరూ రాకపోవడంతో సాయంత్రం 6గంటలకు ప్రైవేట్ ఆసుపత్రికి ఆటోలో తీసుకెళ్తుండగా.. డాక్టర్, నర్సులు అడ్డం తిరిగి మా ఉద్యోగాలు పోతాయి.. ఇక్కడి నుంచి ఎలా తీసుకెళ్తారు అంటూ అడ్డగించారు. మరో డాక్టర్‌కు ఫోన్ చేయడంతో ఉదయం నుంచి రాని డాక్టర్ ఐదు నిమిషాల్లో వచ్చి ఆపరేషన్ చేస్తామని చెప్పారు. రాత్రి బలవంతంగా డాక్టర్లు ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లి డ్రస్ వేసుకుని బయటకు వచ్చి టెన్షన్ టెన్షన్‌గా ఫోన్ మాట్లాడి.. గర్భంలో పాపకు ఎఫెక్ట్ అయిందన్నారు. ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లే ముందు పెద్ద ప్రాణానికి, చిన్న ప్రాణానికి ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పారు. డాక్టర్లు వెంటనే స్పందించకపోవడంతోనే ఇలా జరిగింది. శిశువు ఒంటిపై అక్కడక్కడ చిన్న చిన్న గాయాలున్నాయి. దీనిపై విచారణ చేసి మాకు న్యాయం చేయాలి.

**- రాజు, శ్రీలత భర్త**

# 2 క్రస్ట్‌గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

## మధ్యాహ్నానికి క్లోజ్

హాలియా, ఆగస్టు 25 : నాగార్జున సాగర్ జలాశయం నుంచి ఆదివారం ఉదయం 2 క్రస్ట్ గేట్ల ద్వారా 16,200 క్యూసెక్కుల నీటిని ఎన్ఎస్పీ అధికారులు దిగువకు విడుదల చేశారు. మధ్యాహ్నం 3గంటల సమయంలో గేట్లు మూసివేశారు. శ్రీశైలం జలాశయం నుంచి నాగార్జున సాగర్‌కు వరద వస్తుండగా.. అంతే మొత్తంలో బయటకు వదులుతున్నారు. సాగర్ జలాశయం గరిష్ఠ నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం పూర్తిస్థాయిలో 590 అడుగులు (312.0450 టీఎంసీలు) నీరు ఉంది. కుడి కాల్వకు 9,047 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 8,367, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 29,151, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800, వరద కాల్వకు 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో 48,965 క్యూసెక్కులు వస్తుండగా.. అవుట్ ఫ్లో 48,966 క్యూసెక్కులు ఉంది. ఈ నెలలో ఇప్పటి వరకు నాగార్జున సాగర్ క్రస్ట్‌గేట్ల ద్వారా 140 టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేశారు.



నాగార్జున సాగర్ 2 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల



## కొనసాగుతున్న మూసీ నీటి విడుదల

కేతేపల్లి, ఆగస్టు 25 : మూసీ ప్రాజెక్టు రెండు గేట్ల ద్వారా ఆదివారం నీటి విడుదల కొనసాగింది. ప్రాజెక్టు 2, 7వ నెంబరు క్రస్టు గేట్లను ఒక్కో అడుగు మేర ఎత్తి 1290.26 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కుడి కాల్వకు 119.70 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 215.46 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మొత్తం 1685.64 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో కొనసాగుతుంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల నుంచి 1087.14 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 645 (4.46 టీఎంసీలు) అడుగులు కాగా, ప్రస్తుతం 643.40 (4.04 టీఎంసీలు) అడుగులు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

# అక్కడ మూడు రోజులు.. ఇక్కడ మూడు రోజులు

## డిప్యూటేషన్‌లతో టీచర్ల అవస్థలు


- ఎక్కడా పూర్తి కాని సిలబస్.. ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- ఇద్దరు హెడ్ మాస్టర్ల కింద పనిచేస్తున్న ఉపాధ్యాయులు
- జిల్లా ప్రాతిపదికన సర్దుబాటు చేయకపోవడంతోనే సమస్య

సూర్యాపేట అర్బన్, ఆగస్టు 25 : సూర్యాపేట జిల్లాలో సర్దుబాటు చేసిన ఉపాధ్యాయుల డిప్యూటేషన్‌లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. అసలే రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రస్తుతం మండల స్థాయిలో డిప్యూటేషన్‌లకు మాత్రమే అనుమతి ఇవ్వడంతో మరింత సమస్యలు ఎదుర్కొంటున్నారు. జిల్లా అధికారుల తీరు, అనుభవరాహిత్యంతో తుంగతుర్తి నియోజకర్గంలో పని చేస్తున్న సుమారు 120 మందికి పైగా ఉపాధ్యాయులు వారానికి మూడు రోజులు ఒక పాఠశాలలో మరో మూడు రోజులు డిప్యూటేషన్ పాఠశాలలో పని చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాత్కాలిక పద్ధతిలో చేసిన సర్దుబాటు ద్వారా జరిగిన పాఠశాల డిప్యూటేషన్‌లతో రెండు పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులతోపాటు అక్కడ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు సిలబస్ పూర్తి కాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కానీ జిల్లాలోని చాలా పాఠశాలల్లో అవసరానికి మించి ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ వారికి డిప్యూటేషన్ ఇవ్వకుండా సక్రమంగా నిర్వహణ జరుగుతున్న పాఠశాల నుంచి ఉపాధ్యాయులను పంపడం జిల్లా, మండల అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా చెప్పవచ్చు.

### కలెక్టర్ ఆదేశాలని హుకూం

జిల్లా పరిషత్ పాఠశాలల్లో పని చేస్తున్న పలువురు ఉపాధ్యాయులను మూడు రోజులు ఒక పాఠశాలలో మరో మూడు రోజులు ఇంకొక పాఠశాలలో పని చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. డిప్యూటేషన్‌ల పేరుతో సూర్యాపేట జిల్లాలో తుంగతుర్తి, తిరుమలగిరితోపాటు ఇతర మండలాల్లో సర్దుబాటు చేశారు. ఈ సమయంలలో మహిళా ఉపాధ్యాయులకు వెసులుబాటు కల్పించాలి కానీ ఉన్నతాధికారులు ఇష్టానుసారం చేయడంతో వారు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. కనీసం ముందుగా సమాచారం ఇవ్వకుండా ఇది కలెక్టర్ ఆదేశాలని, తప్పనిసరిగా పాటించాలని, లేకుంటే సమస్యలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉంటుందని మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. జిల్లాలో అధికంగా ఉన్న ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపకుండా తక్కువగా ఉన్న పాఠశాల నుంచి డిప్యూటేషన్లు ఇవ్వడంతో సమస్యలను జిల్లా అధికారులే సష్టిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

### జిల్లా అధికారుల అనాలోచిత నిర్ణయం



జిల్లా అధికారులు అనాలోచిత నిర్ణయంతో ఉపాధ్యాయులపై ఒత్తిడి పెరుగడంతోపాటు ఉపాధ్యాయులకు సిలబస్ రెండు చోట్లా పూర్తి చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. వారం బోధించాల్సిన సిలబస్ మూడు రోజుల్లో పూర్తి చేయాల్సి వస్తుంది. దీంతో ఇటు విద్యార్థులు, అటు ఉపాధ్యాయులపై భారం పడుతున్నది. విద్యార్థులకు ఇచ్చిన హోమ్ వర్క్ క్షణ్ణంగా పరిశీలించి తప్పొప్పులను కూడా సరిచేసే పరిస్థితి లేకపోవడంతో ఎఫ్ఏ -1పై ప్రభావం పడుతుంది. ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు ఉపాధ్యాయులను పంపడం మూలంగా ఎక్కువగా ఉన్న పాఠశాలల్లో విద్యార్థుల చదువుపై అస్తవ్యస్తంగా మారింది.

### అడ్మినిస్ట్రేషన్‌పై ప్రభావం

డిప్యూటేషన్ తీసుకున్న ఉపాధ్యాయులు ఇద్దరు హెడ్‌మాస్టర్ల కింద పని చేయడంతో వారి ఆదేశాలు పాటించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఉపాధ్యాయులు సెలవు తీసుకోవాల్సిన పరిస్థితుల్లో ఇద్దరు హెడ్‌మాస్టర్ల పర్మిషన్ తీసుకుంటున్నారు. డిప్యూటేషన్ ఇచ్చే సమయంలో కనీసం ఉపాధ్యాయుల అభిప్రాయాలు తీసుకోకుండా జిల్లా అధికారులు ఇష్టారాజ్యంగా పాఠశాలలను కేటాయిస్తున్నట్లు తెలుస్తున్నది. డిప్యూటేషన్‌పై రెండు పోస్టులు ఉన్న ఉపాధ్యాయులను పంపాలి కాని, అధికారులు ఆ నిబంధనను పట్టించుకోలేదని ఉపాధ్యాయ సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### జిల్లా ప్రాతిపదికన సర్దుబాటు చేయాలి

అధికారులు జిల్లాలో ఉపాధ్యాయులు అధికంగా ఉన్న పాఠశాలలను గుర్తించి అక్కడి నుంచి డిప్యూటేషన్ చేస్తే ప్రయోజనం ఉంటుంది. కానీ మండల ప్రాతిపదికన సర్దుబాటు చేస్తున్నారు.దీంత ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఇబ్బంది కలుగుతున్నది. కలెక్టర్ దీనిపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో ఉపాధ్యాయుల తరపున సమస్యల పరిష్కారానికి మా సంఘం సిద్ధంగా ఉంటుంది.

**-రేపాక లింగయ్య, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు**





